క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతల నివాళి



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లో శుక్రవారం వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన యువకుడు చందుకు వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి నివాళులర్పించారు. శనివారం గ్రామ సర్పంచ్ పాండురంగన్న, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న వారు హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి చేరుకొని మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని చందు తండ్రి రుద్రయ్యకు ధైర్యం చెప్పారు.

శ్రీకోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామిని దర్శించుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు

గడివేముల: సీపీఐ (ఎంఎల్) గడివేముల మండల నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు శీలన్న ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. మండల కన్వీనర్‌గా షేక్ అబ్దుల్ సలాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే 15 మందిని కమిటీ సభ్యులను పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలో జిందాల్ సిమెంట్ లారీల రాకపోకల వల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినా అలగనూరు రిజర్వాయర్‌కు ఇప్పటి వరకు నిధులు కేటాయించలేదన్నారు. పార్టీ నాయకులు లింగాల శ్రీనివాసులు, నరసింహులు, సామన్న, పిక్కిలి మాధవ, నాయుడు, రసూల్ ఇబ్రహీం, వహీద్, వెంకటేశ్వర్లు, సుంకన్న, షరీఫ్ పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం



ముడుమాలలో పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి.బెళగల్: పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) పురుషోత్తం అన్నారు. శనివారం ఆయన సి.బెళగల్ ఎస్సీ హాస్టల్ వార్డెన్ భాస్కర్‌తో కలిసి మండల పరిధిలోని ముడుమాల గ్రామంలో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌర హక్కుల పరిరక్షణకు ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం కృషి చేయాలని డీటీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



క్రిష్ణయ్య (ఫైల్)

సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామ మాజీ సర్పంచ్ గొల్ల కృష్ణయ్య (68) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈయన గ్రామంలో 2009 నుంచి 2014 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఆ సమయంలో గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. 2009లోనే ఉత్తమ సర్పంచ్‌గా అప్పటి జిల్లా అధికార యంత్రాంగం చేతులు మీదుగా అవార్డు అందుకున్నాడు. మృతుడికి భార్య వెంకటరమణమ్మ, కుమారుడు రవి ఉన్నారు.

యూరియా కొరత.. రైతుల కలత

- యూరియా కోసం అన్నదాతల అవస్థలు
- ఇతర కాంప్లెక్స్ ఎరువులు అంటగడుతున్న డీలర్లు
- బొల్లవరం గ్రామానికి ఒక్కబస్తా అందించని వైనం
- ఆలస్యం అయితే పంట దెబ్బతింటుందని రైతుల ఆందోళన



కరిమద్దెలో యూరియా కోసం వేచియున్న రైతులు

గడివేముల: మండల వ్యాప్తంగా యూరియా సరఫరా అరకొరగా ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలకు అవసరమైన యూరియా లభ్యం కాక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఆర్‌బీఎస్‌కేల ద్వారా కొద్దిమేరకే పంపిణీ జరగడంతో రైతు సేవా కేంద్రాల్లో నిల్వలు తక్కువగా ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో మాత్రం యూరియా ప్రైవేట్ డీలర్ల వద్దే ఎక్కువగా లభిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా కొనాలంటే మరో ఎరువును తప్పనిసరిగా కొనాలని డీలర్లు ఒత్తిడి చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. చిందుకూరు, కొర్రపోలూరు సచివాలయం పరిధిలోని బొల్లవరం గ్రామంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఒక్క బస్తా యూరియా కూడా కేటాయించలేదని రైతులు వాపోతున్నారు. అక్కడి రైతులు వర్షాధారంగా మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేస్తున్నారు. యూరియా లేక ప్రైవేట్ డీలర్ల వద్ద బస్తా రూ.350–400 చొప్పున కొనుగోలు చేసి వినియోగించుకుంటున్నామని తెలిపారు. మండల వ్యాప్తంగా 22 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులు బస్తా రూ.1300 పైగా ఉండడంతో రైతులు తక్కువగా వినియోగిస్తారు. అయితే యూరియా తక్కువ ధరకే (రూ.266) అందుబాటులో ఉండడం, పంట ఎదుగుదలకు మేలుచేయడం వల్ల దీనిపై రైతులకు అధిక మక్కువ ఉంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎరువుల లభ్యత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేవని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యలు పెరిగాయని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుని అవసరమైన మేరకు యూరియా అందించాలని కోరుతున్నారు.

మనోడైతే ఓకే.

వారికి కావాల్సిన వాడైతే ఎన్ని బస్తాలైనా ఇస్తున్నారు. రైతులకు మాత్రం యూరియా కావాలంటే కాంప్లెక్స్ ఎరువులు కొనాలని బలవంతం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా అందించకుంటే పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పోలీసుల పహారాలో పంపిణీ

యూరియా కొరత కారణంగా కొన్ని గ్రామాల్లో స్థానిక పోలీసుల పహారాలోనే రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ జరుగుతోంది. కరిమద్దెల, పెసరవాయి, దుర్వేశి, కొరటమద్ది గ్రామాల్లో వరి సాగు ఎక్కువగా ఉండడంతో రైతులు యూరియా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని సరిపడినంత యూరియా అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతి ఊరికీ యూరియా అందించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి యూరియా కొరత అధికంగా ఉంది. టీడీపీ నాయకులు చెప్పిన గ్రామాలకు మాత్రమే సరఫరా చేస్తున్నారు. మజరా గ్రామాలైన అళ్లగడ్డ,గ్రంధివేముల, బొల్లవరం, బైబోగుల, వైకే తండా గ్రామాలకు సంబంధించిన రైతు సేవాకేంద్రాలు వేరే గ్రామాల్లో ఉండడంతో రైతులు తెచ్చుకునేందుకు వెళ్లినా దొరకడం లేదు. మెట్ట ప్రాంతాల్లో సాగు చేసిన పంటలకు యూరియా అందకపోవడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

– మధుసూదన, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

ఎరువులు అంటగడుతున్నారు



ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామంటున్నారు. అవసరం లేకున్నా కాంప్లెక్స్ ఎరువులు కొనాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మొక్కజొన్నకు యూరియా ఎంతో అవసరం ఉంది. సీజన్ ప్రారంభం నుంచి ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక రేట్లకు కొనుగోలు చేసి వాడుతున్నాను. అధికారులు స్పందించి రైతులకు అవసరమైన యూరియాను బొల్లవరంలోనే అందించే ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది.

– రమణారెడ్డి, రైతు, బొల్లవరం

ఎరువులు అందించాలి



మా గ్రామం చిందుకూరు రెవెన్యూ పరిధిలో ఉంది. కొర్రపోలూరు సచివాలయంలో సేవలు అందిస్తున్నారు. మజరా గ్రామం కావడంతో ఎక్కడికి వెళ్లి ఎరువులు తెచ్చుకోవాలో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 20 కి.మీ దూరం వెళ్లి యూరియా తెచ్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు. సకాలంలో యూరియా అందక మెట్ట ప్రాంతంలో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడులు తగ్గిపోయే పరిస్థితి నెలకొంది.

–యేలంపల్లె అంజనమ్మ, సర్పంచ్, బొల్లవరం

అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి



మా గ్రామం మెట్ట ప్రాంతం కావడంతో ఒకే పంటను సాగు చేస్తారు. నేను 10 ఎకరాల్లో మొక్కజొన్న పంటను వేశాను. కొద్ది రోజులుగా మంచి వర్షాలు కురవడంతో సాగు చేసిన పంటలకు యూరియా అవసరం ఏర్పడింది. అయితే యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్నాం. మా ఊరి నుంచి చిందుకూరు గ్రామానికి వెళ్లి ఆర్ఎస్‌కేల వద్ద గంటల కొద్దీ నిలబడినా ఫలితం లేకుండాపోతోంది.

–మురళీకృష్ణ, బొల్లవరం

డయేరియాపై అవగాహన



ఓఆర్ఎస్, జింక్ మాత్రలను చూపిస్తున్న వైద్యాధికారులు

కల్లూరు: డయేరియా వ్యాధితో బాధపడుతున్న వారికి తప్పనిసరిగా ఓఆర్ఎస్, జింక్ మాత్రలను ఇవ్వాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు వైద్యసిబ్బందికి సూచించారు. శనివారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా ఆరోగ్య కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డయేరియాపై అవగాహన కల్పించారు. అతిసారా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు తల్లిపాలు ఇస్తూ ఓఆర్ఎస్, జింక్ మాత్రలను ఇవ్వాలని, విరేచనాలు తగ్గిన తరువాత ఓఆర్ఎస్ వినియోగించరాదన్నారు. జింక్ మాత్రలు 14 రోజుల పాటు చిన్నారులకు వేయాలని సూచించారు. రెండు నెలల నుంచి ఆరు నెలలలోపు చిన్నారులకు చనుపాలలో మాత్ర కలిపి 10 మిల్లీ గ్రాముల (అర మాత్ర) వైద్యుల సూచన మేరకు వాడాలన్నారు. ఆరు నెలలు దాటిన పిల్లలకు ఒక మాత్ర నీటిలో లేదా తల్లిపాలలో కలిపి ఇవ్వడం వల్ల అతిసార వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా లభిస్తాయన్నారు. మెడికల్ ఆఫీసర్ ఆనందరావు, ఆరోగ్య విస్తరణ అధికారి విజయకుమార్, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు మద్దమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

వెండి కిరీటం చోరీపై విచారణ

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో వెలసిన శ్రీవీరభద్రస్వామి ఆలయంలో స్వామి వెండి కిరీటాన్ని గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం ఎత్తుకెళ్లిన సంఘటనపై శనివారం కోడుమూరు పోలీసులు విచారణ చేపట్టారు. క్లూస్ టీం సభ్యుల సాయంతో పోలీసులు ఆలయంలో దొంగ వేలిముద్రలు, ఆనవాళ్లను సేకరించారు. కాగా దొంగలించబడిన స్వామి వెండి కిరీటం విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

ఎన్ఈపీకి అనుగుణంగా పాఠ్య ప్రణాళికలు

కర్నూలు కల్చరల్: జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా పాఠ్య ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీఎస్ షావలిఖాన్ అన్నారు. శనివారం వర్సిటీలో హైబ్రిడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) విధానంలో జరిగిన బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానం 2020కు అనుగుణంగా పాఠ్య ప్రణాళికల తయారీలో యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలకు అనగుణంగా వివిధ సబ్జెక్టుల్లో పాఠ్య ప్రణాళికలను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ, యూజీసీ నెట్ సిలబస్‌లను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. సిలబస్ విద్యార్థులకు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో పాటు స్వయం ఉపాధి కల్పనకు అవకాశం ఉండాలన్నారు. అలాగే యూనివర్సిటీ రూపొందించిన పాఠ్యప్రణాళికలను రాష్ట్ర ఉర్దూ అకాడమీ సహకారంతో ఉర్దూ మాధ్యమంలో అనువదించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ, వివిధ శాఖల బోర్డ్ ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌లు సభ్యులు, ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మహబుబ్ బాషా, టీచింగ్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న వినాయకుడు



శ్రీ చెన్న సోమేశ్వర ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన మహాగణనాథుడు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో కొలువైన గణనాథుడు నాలుగో రోజు ప్రత్యేక పూజలందుకున్నాడు. ఆదివారం ఈ వినాయకుడికి సుంకేసుల దగ్గర తుంగభద్ర నదిలో నిమజ్జనం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం గ్రామస్తులు పెద్ద సంఖ్యలో గణనాథుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



గడివేములలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

గణనాథునికి ఘనంగా వీడ్కోలు

గడివేముల: జైబోలో గణేష్ మహారాజ్‌కీ జై..అంటూ గ్రామాల్లో కొలువైన గణనాథులను శనివారం నిమజ్జనానికి తరలించారు. మండల కేంద్రమైన గడివేముల గ్రామంలో కొలువైన గణనాథులు నిమజ్జనానికి తరలివెళ్లాయి. గణేష్ మండపాల వద్ద చిన్నా,పెద్దా, మహిళ అనే తేడా లేకుండా భక్తిశ్రద్ధలతో ట్రాక్టర్లపై వినాయకులను తీసుకెళ్లి నిమజ్జన వేడుకల్లో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలో వినాయకుని చేతిలో ఉంచిన లడ్డూను కొనుగోలు చేసేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా యువకులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఉచిత బస్సు సేవను వినియోగించుకోవాలి

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు సదుపాయాన్ని మహిళలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. శనివారం మార్కెట్‌యార్డులో నిర్వహించిన స్త్రీశక్తి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం రూ.10.10 కోట్ల బ్యాంకు రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. తరువాత ఎమ్మెల్యే బస్సులో ప్రయాణం చేశారు. కార్యక్రమంలో డీపీఓ లలితాబాయి, ఎంపీడీ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం



వైద్య,ఆరోగ్య అధికారులతో మాట్లాడుతున్న రఘు

ఓర్వకల్లు: లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, గర్భంలోని పిండాన్ని తొలగించడం (భ్రూణ హత్య) చట్టరీత్యా నేరమని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ రఘు అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న సంచార వైద్య పరీక్షలను పరిశీలించారు. చిన్న వయస్సులో పెళ్లిళ్ల జరగడం వల్ల బాలికలకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని, అవగాహన లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. బాల్యవివాహాలు కూడా చట్టరీత్యా నేరమని, వాటిని నిరోధించాలని, అలాంటి వారందరూ శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ‘బేటీ బచావో – బేటీ పడావో’ నినాదాన్ని అందరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. లింగనిర్ధారణ పరీక్షల ద్వారా ఆడపిల్ల అని తెలుసుకొని భ్రూణహత్యలు చేయకుండా ఆడపిల్లలను రక్షించాలని సూచించారు. ఆడపిల్లలను ఎవరూ చిన్నచూపు చూడకూడదన్నారు. వారికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే 1098 లేదా 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ అంశాలపై ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్యాధికారి రాధామోహన్, స్టాఫ్ నర్సులు సౌజన్య, ఉమారాణి, పర్యవేక్షకురాలు ఎస్తేర్‌రాణి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



సి.బెళగల్ గురుకులంలో విద్యార్థులకు వైద్య పరీక్షల నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సి.బెళగల్: వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ నిస్సిగ్రేసి అన్నారు. శనివారం మండల కేంద్రం సి.బెళగల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చింతలయ్య అధ్యక్షతన వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా విద్యార్థులకు రక్త పరీక్షలు, ఎత్తు, బరువు కొలతలు తీసుకున్నారు. అనంతరం వర్షాకాలంలో సోకే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పుష్పావతి, ఏఎన్ఎం పద్మావతి, ఆశా కార్యకర్తలు హుసేన్‌బీ, మంగమ్మ, రాజకుమారి, మార్తమ్మ, శేషమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినులకు సన్మానం



గూడూరులో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థినులను సత్కరిస్తున్న కుర్ణీ సంఘం పెద్దలు

కోడుమూరు రూరల్: గూడూరు పట్టణంలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ఇద్దరు విద్యార్థినులను కుర్ణీ యువసేన సభ్యులు శనివారం సత్కరించారు. ఇటీవల వెలువడిన ఎంబీబీఎస్ ఫలితాల్లో గూడూరుకు చెందిన వెంకటేష్ కుమార్తె శ్రీధన్య 592 మార్కులతో మంగళగిరి ఎయిమ్స్ మెడికల్ కళాశాలలో సీటు సాధించగా, తిమ్మప్ప కుమార్తె ఊర్మిళ 488 మార్కులతో అనంతపురం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. దీంతో కుర్ణీ సంఘం పెద్దలు, యువసేన సభ్యులు ఆ ఇద్దరిని సత్కరించారు. కార్యక్రమంలో కుర్ణీ సంఘం పెద్దలు నాగభూషణం, చంద్రశేఖర్, నరసింహులు, సురేంద్రనాథ్, శ్రీను, వెంకటేష్, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో డ్రగ్స్‌ను పారద్రోలుదాం

- ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ

కర్నూలు: సమష్టి కృషితో డ్రగ్స్‌ను పారద్రోలుదాం అని ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ పిలుపునిచ్చారు. దూపాడు దగ్గర ఉన్న అశోక ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ‘డ్రగ్స్ వద్దు బ్రో...’ అనే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆకె రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ వద్దు బ్రో.. అనే పేరుతో పోస్టర్‌ను విడుదల చేశారు. డ్రగ్స్ మిమ్మల్నే కాదు... మీ కుటుంబాలను నాశనం చేస్తుంది.. బాల్యాన్ని బలి తీసుకుంటున్న డ్రగ్స్ మత్తులో పిల్లలపై అఘాయిత్యాలు, డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుంటున్న విద్యార్థులు అనే పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, గంజాయిని కట్టడి చేయడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ పేరుతో యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా గంజాయి సాగు, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1972కు అందించాలన్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ డ్రగ్స్ రమాదేవి, అశోక గ్రూప్స్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సీఈఓ డాక్టర్ హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ ఆర్.నవీన్, ఈగల్ టీమ్ సీఐ ప్రసాద్, ఎస్ఐ సుజన్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





ఉదయం 11 గంటల సమయంలో గుండ్రేవుల సచివాలయంలో ఒకే ఒక్క ఉద్యోగి, కొండాపురంలో ఉదయం 11:42 గంటల సమయంలో తెరుచుకోని సచివాలయ తలుపులు

సచివాలయాలపై పర్యవేక్షణ కరువు

- సమయపాలన పాటించని ఉద్యోగులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సి.బెళగల్: మండలంలోని గ్రామ సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పలువురు వేళకు రావడం లేదు. శనివారం మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామ సచివాలయంలో ఉదయం 11 గంటల సమయానికి సర్వే సహాయకుడు ఆరోను అనే ఒకే ఒక్క ఉద్యోగి విధులకు హాజరయ్యాడు. ఇక కొండాపురం గ్రామ సచివాలయం తలుపులు ఉదయం 11:42 గంటలకు కూడా తెరచుకోలేదు. వివిధ పనుల కోసం సచివాలయానికి వచ్చిన గ్రామస్తులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ముడుమాల గ్రామ సచివాలయంలో 8 మంది ఉద్యోగులు ఉండగా, ఇద్దరు ఉద్యోగులు మాత్రమే సచివాలయంలో అందుబాటులో ఉన్నారు. కాగా సచివాలయాలకు ఉద్యోగులు ఎప్పుడు వస్తారో..? ఎప్పుడు వెళ్తారో తెలియదని గ్రామస్తులు అంటున్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. మండల అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే దీనికంతటికి కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎంపీడీఓ రాణెమ్మ వివరణ కోరగా సమయపాలన పాటించని ఉద్యోగులు వివరాలు సేకరించి వివరణ తీసుకుంటానని చెప్పారు.

ఎండిన చెట్టుకు కొత్త జీవం..!



ఎండిపోయిన చెట్టుకు అల్లుకున్న పచ్చటి ఆకులు

మండలంలోని కొండజూటూరు గ్రామ సమీపంలో రోడ్డుపక్కన ఓ మోడువాడిన చెట్టు పచ్చటి పొలాల మధ్య అందరినీ ఆకర్షిస్తోంది. నీలాకాశం కింద పచ్చని వరి పైర్ల మధ్యలో ఎండిపోయిన ఆ చెట్టు ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఎండిన చెట్టుకు పచ్చని ఆకులు అల్లుకున్న తీరు చూడగానే జీవం నింపినట్టుగా అనిపిస్తోంది. ఎండిన చెట్టుకి మళ్లీ పచ్చదనం వచ్చిందా? అనే ప్రశ్న రాకమానదు. రోడ్డున వెళ్తున్న వారు ఈ చెట్టును చూసి ఆశ్చర్యపోతూ కాసేపు నిలిచి చూసే పరిస్థితి ఏర్పడుతోంది.

–పాణ్యం